క్లుప్తంగా

నేడు రాయవరంలో ఐక్య గ్రాండ్ క్రిస్మస్

రాయవరం: మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం రాయవరంలో ఐక్య గ్రాండ్ క్రిస్మస్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు మంగళవారం విలేకరులకు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్టు వారు చెప్పారు.

నేడు కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం

కపిలేశ్వరపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న కుల గణన కార్యక్రమంపై క్షేత్ర స్థాయిలో అభిప్రాయాలను తెలుసుకోవడం, కార్యాచరణపై చర్చించేందుకు బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లను ఆహ్వానించినట్టు ఎంపీడీఓ తెలిపారు.

ఈనెల 8న జాబ్‌మేళా

మామిడికుదురు: స్థానిక దీప్తి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 8న వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ బాజ్‌మేళాలో డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్), కోజెంట్ ఈ–సర్వీస్‌లో బీపీఓ, డిక్సాన్, సియోన్ ఈ–హెచ్‌డబ్ల్యూ సుమిత్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పిస్తారని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని చెప్పారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి కల్పిస్తారని సత్యనారాయణ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8వ తేదీ ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్, జెరాక్సులతో హాజరు కావాలని కోరారు.

పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి



పి.గన్నవరం మండలంలో పశువుల శాలలో పాడి రైతుతో మాట్లాడుతున్న విజయారెడ్డి

పి.గన్నవరం: తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు(ఏడీ) ఎల్.విజయారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని ఎల్.గన్నవరం, ఊడిమూడి గ్రామాల్లో మంగళవారం ఆయన పశువుల శాలలను పరిశీలించి, పాడి రైతులతో మాట్లాడారు. పశువులను రాటలకు కట్టకుండా విడిగా వదిలేయాలని అన్నారు. వ్యాధులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పశు వైద్య సహాయకులంతా అందుబాటులో ఉన్నారని ఆయన వివరించారు. అత్యవసర సమయంలో పశు వైద్య సహాయకులను సంప్రదించాలని ఏడీ పాడి రైతులకు సూచించారు.

స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే కుటుంబం



అంతర్వేది ఆలయంలో ఎమ్మెల్యే రాపాక కుటుంబ సభ్యులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుటుంబ సభ్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కుమారుడు వెంకట్ రామ్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి వచ్చి వెంకట్‌రామ్ ఈ పూజలు చేశారు. పూజలు అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి లడ్డు ప్రసాదాన్ని సూపరింటెండెంట్ పి.విజయసారథి అందజేశారు.

పాక కూలి లేగ దూడ మృతి

మలికిపురం: తుపాను కారణంగా వీచిన గాలులకు మండటంలోని గుడిమెళ్లంకలో జిల్లెళ్ల రమణకు చెందిన పశువుల పాక కూలిపోయింది. అందులో ఉన్న గేదె దూడ మృతి చెందింది. తహసీల్దార్ జీవీఎల్ నరసింహారావు, ఏఈ రాకేశ్ తదితరులు మండలంలో పర్యటించారు. 48 ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్లు నరసింహారావు తెలిపారు.



పడమర ఖండ్రికలో వర్షంతో నిండిన పొలంలో ధాన్యం రాశిని బరకాంతో కప్పుతున్న రైతు



అంగర ఓఎన్‌జీసీ సమీపాన రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్యారావు



పామర్రులో వర్షపు నీటిలో నానుతున్న ధాన్యం రాశులు



అంగరలో డ్రైయిన్లలో పూడికను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



కపిలేశ్వరపురంలో వర్షపు నీటి పారుదల పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి

విరుచుకుపడ్డ మిచాంగ్

- తీరం దాటే సమయంలో హోరుగాలి, జోరువాన
- స్థంభించిన పల్లె జీవనం
- ముంపులో లోతట్టు ప్రాంతాలు
- తడిచిన ధాన్యం రాశులు



గొల్లపాలెంలో ఈదురుగాలులకు నేలనంటిన వరిపంట

కాజలూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో కాజులూరు మండల గ్రామాల్లో మంగళవారం ఈదురు గాలులతోకూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఓ మోస్తరుగా గాలులు వీస్తూ వర్షం కురవగా మధ్యాహ్నం తుపాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు బీభత్సం సృష్టించడంతో ప్రజలు ఆందోళనలకు గురయ్యారు. మండల గ్రామాల్లో కొన్ని గంటలపాటు కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి ప్రజలు ఇళ్ల లోంచి బయటకు వచ్చేందుకు వీలు లేకుండా పోయింది. కాకినాడ, కోటిపల్లి రహదారిలో చెరువుగట్టు సెంటర్ వద్ద భారీగా వర్షపు నీరు నిలిచిపోయి రోడ్డు మునిగిపోవటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బలమైన గాలులకు చోట్ల చెట్టు కొమ్మలు విరిగి రోడ్లపై పడటంతో మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కూలిన విద్యుత్ స్తంభాలను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించి మంగళవారం రాత్రికే మండల గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తామని గొల్లపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ సూర్యనారాయణ తెలిపారు. తుపాను తీరం దాటినప్పటికీ మరో ఒకటి, రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతుండటంతో రైతులు ఆందోళనలకు గురౌతున్నారు. పంటను రక్షించుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: తుపాను ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఖరీఫ్ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తుపాను కారణంగా భారీ వర్షాలు పడడంతో యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని రోడ్లపైనా, పుంత రోడ్లపైనా రైతులు రాశులుగా పోసి బరకాలు కప్పి ఉంచారు. అయితే ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో కళ్లాల్లో, రోడ్లపై, పుంత రోడ్లపై, ఖాళీ స్థలాల్లో ఉంచిన ధాన్యం రాశులు నీట మునిగాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షం దాటికి పాడైపోతుందోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను సంరక్షించుకునే క్రమంలో రైతులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాశుల వద్ద నిలిచిపోయిన వర్షపు నీటిని పల్లపు ప్రాంతానికి మళ్లించేందుకు నానా పాట్లు పడుతున్నారు. వరి పనలు కోసి పంట పొలంలో ఉన్న ధాన్యం కూడా వర్షపు నీటిలో ఉండడంతో నీటిని మోటార్ల సాయంతో తోడుకుంటున్నారు. కె.గంగవరం మండలంలోని పామర్రు, యర్రపోతవరం, దంగేరు, కె.గంగవరం, కుడుపూరు, భట్లపాలిక తదితర గ్రామాల్లో వర్షం ప్రారంభంతో వరి పంట నీటమునిగింది. గత రెండు రోజులుగా వర్షం కురవడంతో ప్రభుత్వం నిబంధనలు సడలించి ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. వాహనాలకు జీపీఎస్ లేకుండా ఏ వాహనంలోనేనా రైతులు తమకు నచ్చిన మిల్లులకు ధాన్యాన్ని ఎగుమతి చేసుకునే వెసులుబాటు కల్పించారు. తుపాను ప్రభావంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మండలంలో వరి కోతలు పూర్తిగా నిలిపివేశారు. మండలలోని ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. పలు గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, పల్లపు ప్రాంతాలు నీట మునిగిపోవడంతో ప్రజలు నీటిని మళ్లించే ప్రయత్నాలు చేశారు. పలు గ్రామాల్లో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

స్తంభించిన పౌర జీవనం

కపిలేశ్వరపురం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలో పౌర జీవనం స్తంభించింది. అంగర, పడమర ఖండ్రిక, టేకి, వల్లూరు, తాతపూడి, నేలటూరు, కోరుమిల్లి, వాకతిప్ప, కాలేరు, నల్లూరు తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల వీధులు జలమయం అయ్యాయి. ధారాళంగా కురిసిన వర్షపు నీటికి డ్రెయిన్లు పొంగి పొర్లాయి. చెత్త డ్రెయిన్లలో పూడుకుపోయి నీటి పారుదల మందగించింది. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఆయా పంచాయతీల కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు వర్షపు నీరు పారుదల సమస్యను పరిష్కరించారు. అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఆరోగ్య నియమాలను వివరించారు. కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు గ్రామాల్లో ప్రభుత్వ చర్యలను పర్యవేక్షించారు. కపిలేశ్వరపురం, అంగర, వెదురుమూడి గ్రామాల్లోని ఇటుకల బట్టీలు మూతపడ్డాయి. ద్విచక్ర వాహనాలపై పండ్లు,, కూరగాయలు, ఫ్యాన్సీ సామగ్రి విక్రయాలు నిలిచిపోవడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

95 శాతం ఇప్పటికే ఒబ్బిడి

కపిలేశ్వరపురం: తుపాన్ ప్రభావంతో మంగళవారం ఏకధాటిగా వర్షాలు కురిశాయి. పంట పొలాలు నీట మునిగాయి. కపిలేశ్వరపురం మండలంలో 95 శాతం పంట ఇప్పటికే ఒబ్బిడి కావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తుపాన్ ముప్పు గురించి ముందుగానే హెచ్చరించడంతో రైతులు యంత్రాలతో పంటను కోసి ఒబ్బిడి చేసుకున్నారు. మిగిలిన ఐదు శాతం పంట తుఫాన్ ప్రభావానికి గురైంది. కోయని స్థితిలో కొంత, ధాన్యం రాశుల రూపంలో మరికొంత రహదారులపై కొంత ధాన్యం ఉంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి ధాన్యం ముంపుబారిన పడింది. రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులు, సచివాలయ ఉద్యోగులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రైతులకు తోడుగా నిలిచారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తూ సేవలందించారు.

ఎడతెగని వానతో స్తంభించిన జనజీవనం

రామచంద్రపురం రూరల్: మిచాంగ్ తుపాను కారణంగా గత రెండు రోజులగా కురుస్తున్న ఎడతెగని వానతో జన జీవనం స్తంభించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 4, 5, 6 తేదీల్లో మూడు రోజుల పాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వ్యాపారులు షాపులు తెరవక ఇళ్లకు పరిమితమయ్యారు. రైతులు ఆరబెట్టిన ధాన్యం రాశులు కాపాడుకునే ప్రయత్నాల్లో మునిగిపోయారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



మొగలిపాలెంలో రోడ్డుపై కూలిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న కూలీలు

వరి రైతులూ..ఈ జాగ్రత్తలు పాటించండి

రాయవరం: ఖరీఫ్ వరి కోతలు దాదాపుగా ముగిశాయి. ధాన్యాన్ని రాసులుగా పోసుకుని, రైతులు అమ్మకానికి సిద్ధంగా ఉంచుకున్నారు. ఈ నేపథ్యంలో మిచాంగ్ తుపాన్ ముప్పు రైతులకు పొంచి ఉంది. తుఫాను వల్ల రైతులకు నష్టం జరగకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ, రెవెన్యూ శాఖలను అప్రమత్తం చేశారు. ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవడంపై మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. పొలంలో ఉన్న నీటిని బయటకు పంపేందుకు దారులు చేసుకోవాలి. తడిసిన పనలు, కుప్పలపై ధాన్యం మొలక రాకుండా, రంగు మారకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని, బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. రాసులుగా ఉన్న ధాన్యం తడిసినట్లైతే క్వింటా ధాన్యానికి 20 కేజీల వరి ఊక లేదా పొట్టు ఒక కేజీ కళ్ల ఉప్పు కలుపుకుని ధాన్యంలో కలుపుకుంటే రంగు మారకుండా, మొలక రాకుండా జాగ్రత్త చేసుకోవచ్చునని రైతులకు సూచిస్తున్నారు. ఏవోతో పాటు, తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబులు పొలాల్లోకి వెళ్లి రైతులకు భరోసా కల్పిస్తున్నారు.



యర్రపోతవరంలో వర్షపు నీటి నుంచి ధాన్యాన్ని సంరక్షించుకుంటున్న రైతులు



రాయవరం మండలంలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు



ఆర్యావటంలో తెగిపడిన విద్యుత్‌వైర్లు, స్తంభాలను సరిచేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది



కె.గంగవరంలో నీటిలో నానుతున్న ధాన్యాన్ని గట్టుకు చేరుస్తున్న రైతులు



ద్రాక్షారామ ప్రధాన రహదారిపై ఎడతెగని వానతో నేలకొరిగిన పండ్ల దుకాణం

కులగణన పక్కాగా చేపట్టాలి

- ఏఎంసీ ఛైర్మన్ సిరిపురపు, ఎంపీపీ నౌడు
- మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం

రాయవరం: త్వరలో జరగబోయే సామాజిక కుల గణనను పక్కాగా చేపట్టాలని ఏఎంసీ ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణలు సూచించారు. కుల గణనపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, వెంకటరమణ మాట్లాడుతూ కులగణనలో సిబ్బంది ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎంపీడీవో నరేంద్రరెడ్డి మాట్లాడుతూ కులగణన చేసే సమయంలో వారి ఇష్టం మేరకే డాక్యుమెంట్లు తీసుకుంటామన్నారు. ఎవరి వద్ద నుంచి డాక్యుమెంట్లు తీసుకోమన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా వారి వారి కులాల సమాచారాన్ని ధైర్యంగా ఇవ్వాలన్నారు. ఈ నెల 9 నుంచి 19 వరకు 10 రోజుల పాటు కులగణనపై సర్వే నిర్వహిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే ఆడుదాం..ఆంధ్రను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగంగా ఆటలు ఆడడానికి, చూడడానికి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో నరేంద్ర రెడ్డి సూచించారు. వలంటీర్లు ఇంటింటికీ వచ్చి పేర్లు నమోదు చేస్తారని, అలాగే ఎవరికి వారు సొంతంగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దారు విజయరేఖ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు

రైతులు ధైర్యంగా ఉండాలి

తుపాను నేపథ్యంలో రైతులందరూ ధైర్యంగా ఉండాలని, తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎంపీపీ నౌడు వెంకటరమణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎంపీడీవో నరేంద్రరెడ్డితో కలిసి పర్యటించారు. రైతులను కలిసి ప్రస్తుత పరిస్థితిని అడిగి వారికి భరోసా కల్పించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖలు ఇస్తున్న సూచనలు, సలహాలను రైతులు పాటించాలన్నారు. ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో కూడా ధాన్యం కొనుగోలు చేస్తుందని, ఏ ఒక్క రైతునూ నష్టపోకుండా ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందన్నారు. మండలంలోని వెంటూరు, చెల్లూరు, వెదురుపాక, కురకాళ్లపల్లి తదితర గ్రామాల్లో ఎంపీపీ పర్యటించారు.



కురకాళ్లపల్లిలో రైతులను కలిసి భరోసా కల్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ

ప్రమాద బాధితుడికి సాయం

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.16 వేల ఆర్థిక సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం గ్రామానికి చెందిన జక్కంశెట్టి జితేంద్ర వారం రోజుల క్రితం తణుకు హైవే మీద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతడి వైద్యానికి ఇప్పటికే రూ.లక్ష వరకూ ఖర్చు చేశారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో సహాయం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా మంగళవారం బాధితుడి అన్నయ్య శ్రావణ్‌కుమార్‌కి రూ.16 వేల నగదు సాయంగా సంస్థ సభ్యులు అందజేశారు.



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

ఘనంగా అష్టోత్తర పూజ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అష్టోత్తర పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం, తీర్థప్రసాదం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామి వారి అష్టోత్తరాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.



అష్టోత్తర పూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఓటు దరఖాస్తులను పరిశీలిస్తున్నాం

- నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి సుధాసాగర్

కపిలేశ్వరపురం (మండపేట): ఓటు నమోదు, సవరణ ప్రక్రియ కోసం ఈ నెల 2,3 తేదీలలో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్టు మండపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎస్.సుధాసాగర్ తెలిపారు. మండపేట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓటు నమోదు ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేక శిబిరాల నిర్వహణను సమీక్షించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పలు సూచనలు చేశారు. సమావేశంలో మండపేట మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.



మండపేట సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల, ఎన్నికల అధికారి సుధాసాగర్

9న లోక్ అదాలత్

అమలాపురం టౌన్: ఈనెల 9వ తేదీన అమలాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు సముదాయంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసులు, మోటారు ప్రమాదాల కేసులతో పాటు రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. న్యాయవాదులు, పోలీస్, బ్యాంక్, రెవెన్యూ, మున్సిపల్, బీఎస్ఎన్ఎల్ అధికారులు లోక్ అదాలత్ నిర్వహణలో భాగస్వాములై ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

శబరిమల యాత్రకు రెండు ప్రత్యేక బస్సులు

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులను శబరిమల యాత్రకు పంపినట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ మంగళవారం తెలిపారు. మండపేట స్వాములు ఒక బస్సు, జొన్నాడ స్వాములు ఒక బస్సులో శబరిమలయాత్రకు బయలు దేరారన్నారు. ఏడు రోజుల యాత్ర కాణిపాకం, శ్రీపురం, పళని, త్రివేండ్రమ్, పంబ, శబరిమల, తిరుపతి, విజయవాడ దర్శనం అనంతరం రావులపాలెం చేరుతుందన్నారు. అలాగే మొత్తం రావులపాలెం డిపో నుంచి ఈ సీజన్‌లో 10బస్సులు శబరిమల వెళ్లటకు సిద్ధం చేసినట్టు డీఎం తెలిపారు.



రావులపాలెం డిపో నుంచి శబరిమల యాత్రకు బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సు

తాచుపాము హల్‌చల్

అంబాజీపేట: భారీ వర్షాలకు కొబ్బరితోటలు నీట మునిగిపోవడంతో విష సర్పాలు ఇళ్లలోకి చేరుతున్నాయి. దీనిలో భాగంగానే అంబాజీపేట మండలం గంగలకురు అగ్రహారంలో తాచుపాము హల్ చల్ చేసింది. శింగంశెట్టి వెంకట నాగభూషణంకు చెందిన వంట గదిలోకి పాము రావడంతో అతని కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. దాంతో స్నేక్‌క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం ఇవ్వడంతో చాకచక్యంగా తాచుపామును పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు. అనంతరం జనసంచారం లేని ప్రాంతంలో పామును విడిచిపెట్టారు.

ప్రధాని మన్‌కీ బాత్‌ను వీక్షించాలి

అంబాజీపేట: ప్రతి నెలా జరిగే ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించాలని ఈఓపీఆర్డీ బి.మమత అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలందరి కోసం ప్రధాని మోదీ ఆయుష్మాన్ భారత్, ఉచిత బియ్యం, ఉపాధి హామీ పథకం, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం సంకల్ప యాత్రపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విత్తనాల శేఖర్, బంధన రాంబాబు, రాయుడు చంటి తదితరులు పాల్గొన్నారు.



జి.అగ్రహారంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు, అధికారులు, గ్రామస్తులు